క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేసే ప్రాంతాలు

చిలకలూరిపేట: విద్యుత్ లైన్ల మరమ్మతుల్లో భాగంగా పట్టణంలోని పండరీపురంలోని కొన్ని ప్రాంతాలలో బుధవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ ఏడీఈ ఆర్ అశోక్‌కుమార్ తెలిపారు. పండరీపురంలోని 2, 3, 4 లైన్లలో సంబంధిత వేళల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశం

చిలకలూరిపేట టౌన్: నకిలీ ఓట్లు, మరణించిన వారి ఓట్లను తొలగించాలని తహసీల్దార్ జి.సుజాత ఆదేశించారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో నియోజకవర్గ పరిధిలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె ఓటర్ నమోదులో మార్పులు, చేర్పులు, తొలగింపులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు లేవనెత్తిన సమస్యల గురించి చర్చించారు. బూత్ స్థాయి అధికారులు ప్రతి ఇంటికీ తిరిగి రీ వెరిఫికేషన్ చేసి నివేదిక సమర్పించాలని సూచించారు.

అక్రమ మద్యం కేసులో నిందితుడి అరెస్ట్

నరసరావుపేట టౌన్: అక్రమ మద్యం కేసులో నిందితుడిని అరెస్ట్ చేసి అతని వద్ద నుంచి 8 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఎస్‌ఐ సురేంద్రబాబు మంగళవారం తెలిపారు. అందిన సమాచారం మేరకు నకరికల్లు మండలం చల్లగుండ్ల గ్రామంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్నారన్న సమాచారం మేరకు దాడులు నిర్వహించి అక్కడ మద్యం విక్రయాలకు పాల్పడుతున్న సంగీతం రజనీకాంత్‌ను అరెస్ట్ చేసి అతని వద్ద నుంచి మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ మేరకు నిందితుడిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు ఎస్‌ఐ తెలిపారు.

జేవీవీ ప్రచురణల కన్వీనర్‌గా డాక్టర్ దార్ల బుజ్జిబాబు



చిలకలూరిపేటటౌన్: జనవిజ్ఞాన వేదిక ప్రచురణల రాష్ట్ర కన్వీనర్‌గా పట్టణానికి చెందిన డాక్టర్ దార్ల బుజ్జిబాబు ఎంపికయ్యారు. ఈ మేరకు సోమవారం బాలోత్సవ భవన్ విజయవాడలో జరిగిన రాష్ట్ర కమిటీ సమావేశంలో జేవీవీ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ గేయానంద్ ఆయనకు నియామక పత్రం అందజేశారు. ఈయన సందర్భంగా బుజ్జిబాబు మాట్లాడుతూ శాస్త్ర ప్రచారంలో జేవీవీ ప్రచురణల పుస్తకాల పాత్ర గణనీయమైనదని చెప్పారు. అక్షరాలు నేర్చుకొనే పిల్లల దగ్గర నుంచి పరిశోధనల వరకు అందరికీ విజ్ఞానం పంచే దాదాపు 100 రకాల పుస్తకాలను జేవీవీ ముద్రించిందని తెలిపారు. ఈ సందర్భంగా దార్ల బుజ్జిబాబును పలువురు అభినందించారు.

కేంద్రానిది నిర్లక్ష్య వైఖరి

చిలకలూరిపేట: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రైతాంగ సమస్యల పరిష్కారం పట్ల తీవ్ర నిర్లక్ష్యం చూపుతోందని వామపక్ష రైతు సంఘాల నాయకులు విమర్శించారు. 2021 అక్టోబర్ 3న లఖింపూర్ ఖేరీలో రైతుల హత్యాకాండకు సూత్రధారి అయిన కేంద్ర మంత్రి అజయ్‌మిశ్రాను పదవి నుంచి తొలగించి, ప్రాసిక్యూట్ చేయాలని కోరుతూ దేశ వ్యాప్తంగా బ్లాక్ డే నిర్వహించాలని సంయుక్త కిసాన్ మోర్చా, కేంద్ర కార్మిక సంఘాలు పిలుపునిచ్చాయి. ఈ పిలుపులో భాగంగా పట్టణంలోని ఎన్‌ఆర్‌టీ సెంటర్‌లో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద వామపక్ష రైతు సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా నిర్వహించారు. సీపీఐ ఏరియా కార్యదర్శి నాగభైరు రామసుబ్బాయమ్మ, రైతు సంఘాల నాయకులు తాళ్లూరి బాబురావు, బొల్లు శంకరరావు, షేక్ సుభాని, లలితకుమారి, నాయుడు శివ, ఆరాధ్యుల రామకృష్ణ, బొంతా భగత్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ఒకరు అపస్మారక స్థితి



యడ్లపాడు: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి గాయపడి అపస్మారకస్థితికి వెళ్లిన సంఘటన మండలంలోని తిమ్మాపురం హైవేపై జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నాదెండ్ల మండలం చిరుమామిళ్ల గ్రామానికి చెందిన కంచర్ల పాపారావు, యామర్తి వెంకటప్పయ్య చిలకలూరిపేటలో కూలీ పనులు చేసుకుని రాత్రి ఇద్దరు బైక్‌పై ఇంటికి పయనమయ్యారు. ఈ నేపథ్యంలో తిమ్మాపురంలోని నందివర్ధనం నూలుమిల్లు సమీపంలో రాగానే అదేమార్గంలో వస్తున్న ప్రకాశం జిల్లా కొండెపికు చెందిన సీహెచ్ మాల్యాద్రి ముందు వెళ్తున్న వాహనాన్ని వెనుక నుంచి ఢీకొట్టాడు. ప్రమాదంలో ముందు వాహనం వెనుక భాగం పాక్షికంగా దెబ్బతింది, ఆ వాహనంపై ఉన్న ఒకరికి స్వల్పగాయాలు కాగా వెనుక ఢీకొన్న వాహనంపై ఉన్న మాల్యాద్రి తలకు తీవ్రగాయాలై అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న హైవే పోలీసులు సంఘటనా స్థలాన్ని చేరుకుని 108 వాహనంలో చిలకలూరిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

95.15 శాతం పింఛన్ల పంపిణీ



వైఎస్సార్ పెన్షన్ కానుక కింద యడ్లపాడు మండలం పరిధిలో మొత్తం 8,183 మంది పింఛన్‌దారులు ఉండగా వీరికి అక్టోబర్ నెల పింఛన్ల కింద రూ.రూ.2,23,96,250 నగదు విడుదలైందని ఎంపీడీవో వై.హనుమారెడ్డి తెలిపారు. మంగళవారం సాయంత్రం నాటికి 7,758 మందికి రూ.2,13,27,000 పింఛన్లు పంపిణీ చేసినట్లు వెల్లడించారు. దీంతో మండలంలో 95.15శాతం పంపిణీ ప్రక్రియ పూర్తయినట్లు తెలిపారు.

– యడ్లపాడు

సీసీ కెమెరాలు పెట్టుకోండి



వినుకొండ ఏనుగుపాలెం రోడ్డులో గల మహాత్మా గాంధీ క్లాత్ మార్కెట్ పక్క షాపుల యజమానులకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలంటూ పట్టణ సీఐ సాంబశివరావు అవగాహన కల్పించారు. సీసీ కెమెరాల వల్ల వాహనాలు పోయినా, దొంగతనాలు, కొట్లాటలు జరిగినట్లయితే రికార్డ్ అవుతుందని, నేరాలను నివారించడంలో సహాయపడుతుందని ఆయన తెలిపారు. వ్యాపారస్తులు తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

–వినుకొండ(నూజెండ్ల)

సంపూర్ణ పోషణ



చిన్నారుల కొలతల నమోదుతో బరువు తక్కువ వారిని గుర్తించి వారికి సరైన పోషణ అందజేస్తామని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మజా రాణి తెలిపారు. మండలంలోని పేరూరుపాడు అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారుల కొలతల నమోదు మంగళవారం నిర్వహించారు. రక్తహీనత తదితర రకాల వ్యాధులతో ఉన్న వారికి వైద్య చికిత్స అందజేశారు. కార్యక్రమంలో గ్రామ సచివాలయ పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు తదితరులు పాల్గొన్నారు.

–బొల్లాపల్లి

ఉత్తమ ఫలితాలు రావాలి



పదోతరగతి ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు కావల్సిన ప్రత్యేక ప్రణాళికను రూపొందించుకోవాలని జిల్లా ఉప విద్యాశాఖాధికారి కె.వేణుగోపాల రావు ఆదేశించారు. మంగళవారం నరసరావుపేట మండలంలోని ఇసప్పాలెం గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేశారు. ఈసందర్భంగా పదోతరగతి విద్యార్థుల అభ్యాసనా సామర్థ్యాలను పరిశీలించారు. విద్యార్థుల నోటు పుస్తకాలు, వర్క్‌బుక్‌లను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.

– నరసరావుపేట

ఆరోగ్యానికి రక్ష- జగనన్న సురక్ష

- ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు
- అందుగుల కొత్తపాలెంలో ప్రజారోగ్యానికి భరోసా- జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

వినుకొండ(నూజెండ్ల): జగనన్న ఆరోగ్య సురక్ష ప్రజలందరి ఆరోగ్యానికి రక్షగా ఉంటుందని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అన్నారు. ప్రజారోగ్యానికి భరోసా- జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా వినుకొండ రూరల్ మండలం అందుగుల కొత్తపాలెం గ్రామంలో నిర్వహించిన వైద్యశిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొల్లా మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ప్రతి గ్రామంలోని ప్రతి ఒక్కరికీ ఉచితంగా ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు. ప్రతి ఇంటికీ వెళ్లి ప్రాథమిక వైద్య పరీక్షల ద్వారా అనారోగ్య సమస్యల్ని గుర్తించి వారికి ఉచితంగా వైద్యం, మందులు అందించడంతో పాటు సలహాలు, సూచనలు కూడా ఇవ్వడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమన్నారు. ఆరోగ్యం విషయాల్లో చిన్న కుటుంబాలు మెరుగైన వైద్యం చేయించుకోలేక పోతున్నాయని, అలాంటి వారికి జగనన్న ఆరోగ్య సురక్ష చాలా మంచి కార్యక్రమమని వివరించారు. చాలా మందికి ఏ ఆరోగ్య సమస్యకు ఎవరి వద్దకు వెళ్లాలో తెలియదనీ, అలాంటి వారిని గుర్తించి వారికి అవసరమైన సహాయం ప్రభుత్వం నుంచి అందే విధంగా చూడాలని అధికారులకు సూచించారు. కచ్చితంగా మనమంతా కలిసికట్టుగా పనిచేసి ప్రజలందరి ఆరోగ్యానికి భరోసా కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ పగడాల జయశ్రీ వెంకట రామిరెడ్డి, జెడ్పీటీసీ సూరాబత్తుని విజయలక్ష్మీ రాజేశ్వరరావు, మండల కన్వీనర్ దండు చెన్నయ్య, సర్పంచ్ జి.నాగేశ్వరరావు, మాజీ ఎంపీపీ ములకా రామతులసిరెడ్డి, వైద్యులు, ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులు, 104 సిబ్బంది, ఆరోగ్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు, ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్‌ఎంలు తదితరులు పాల్గొన్నారు.

పేరూరుపాడులో...

బొల్లాపల్లి: మండలంలోని పేరూరుపాడు గ్రామసచివాలయ పరిధిలో ప్రాథమికోన్నత పాఠశాలలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్యశిబిరంలో దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న కీళ్ల నొప్పులు, బీపీ, షుగర్ తదితర వ్యాధులకు వైద్యులు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి ఎంపీడీవో షేక్ జిలానీబాషా మాట్లాడుతూ ప్రజలకు సురక్షితమైన నాణ్యమైన వైద్యసేవలను అందుబాటులోకి తేవడమే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో నిరుపేదలు, వృద్ధులకు ఆరోగ్య సురక్ష ద్వారా ఎంతో మేలు జరుగుతుందని, ప్రతిఒక్క కుటుంబంలో అనారోగ్యంతో ఉన్నవారు జగనన్న ఆరోగ్య సురక్ష పథకాన్ని సద్వినియోగపరచుకోవాలని సూచించారు. ఈ వైద్యశిబిరంలో 580 మంది వైద్యసేవలు పొందారని వారికి ఉచితంగా మందులు అందజేశామని వెల్లటూరు వైద్యాధికారి జి.వీరనరేష్ ఈ మేరకు తెలిపారు. వీరిలో 19 మందికి ఆరోగ్యశ్రీ ద్వారా ఉచిత వైద్యసేవలు అందించేందుకు కార్పొరేట్ వైద్యశాలలకు సిఫార్సు చేశామని వైద్యాధికారి తెలిపారు. వైద్యశిబిరాన్ని సాయంత్రం జగనన్న ఆరోగ్య సురక్ష నోడల్ అధికారి నాగపద్మజ సందర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రతిఒక్కరికీ మెరుగైన వైద్యసేవలు అందించేలా చూడాలని నోడల్ అధికారి వైద్యాధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎం.స్వాతి, ఎంపీటీసీ డి.ఎలిశమ్మ, ప్రత్యేక వైద్యులు టి. శ్రీవిద్య, పి.రేణుకదేవి, స్థానిక వైద్యులు పి. కృష్ణనాయక్, శంకర్ నారాయణ, వైఎస్సార్ సీపీ నాయకులు ఎం. రాజయ్య, టి.హుస్సేన్‌రెడ్డి, జి. అంజిరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

వేల్పూరులో...

శావల్యాపురం: ఆరోగ్యమే మహాభాగ్యమని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అన్నారు.మంగళవారం మండలంలోని వేల్పూరు గ్రామసచివాలయం-1 పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. తొలుత ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు వైద్యశిబిరంలో ఏర్పాటు చేసిన వివిధ రకాల మందుల స్టాల్స్ స్వయంగా పరిశీలించి వైద్యులకు పలు రకాల సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు మాట్లాడుతూ భారతదేశంలో ఏరాష్ట్రంలో జరగని జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం మన రాష్ట్రంలో నిర్వహించటం పేదలకు వరం మన్నారు. ఈ శిబిరంలో 368 మంది రోగులతో పాటు గర్భిణులు, బాలింతలు ప్రత్యేక వైద్య పరీక్షలు నిర్వహించారు. ఇంటింటి సర్వేలో భాగంగా వైద్య ఆరోగ్య సిబ్బంది బీపీ, షుగర్, హిమోగ్లోబిన్ తదితర వైద్య పరీక్షలు 2903 మంది చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రంతు శ్రీనివాసరావు, ఎంపీటీసీ సభ్యురాలు లింగా పున్నమ్మ, ఎంపీపీ ముండ్లమూరి సుహాసిని అనిల్‌కుమార్, ఈపూరు మార్కెట్ యార్డు చైర్మన్ చుండూరి వెంకటేశ్వర్లు, సొసైటీ చైర్మన్ నాగులపాటి చెన్నయ్య, మండల ప్రత్యేక అధికారి యం.వెంకటరెడ్డి, తహసీల్దారు షేక్ జాన్ సైదులు, ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య, వైద్యాధికారులు వేముల వెంకట భాస్కర్, ఆర్. రాధాకృష్ణన్, పి.సింధుజ, చాంద్‌బాష, వంశీనాథ్, నటరాజన్, సూపర్‌వైజర్లు ఏడుకొండలు, ఉమాదేవి, ఆరోగ్య కార్యకర్తలు అమరలింగేశ్వరీ, విజయమ్మ, ఎంఎల్‌హెచ్‌పీ మేరికుమారి, శ్యామలత, వైఎస్సార్ సీపీ గ్రామపార్టీ అధ్యక్షులు తూమాటి కబ్బారావు, స్వర్ణాల వెంకటరావు,ముండ్రు రాఘవరావు, బీర్పేడి రత్నప్రభ, పంచాయతీ కార్యదర్శులు ముండ్రు మనోహర్,ఆళ్ళ యుగందర్, వీఆర్వోలు వీరవల్లి నాగ సంతోషలక్ష్మి, శ్రీనివాసరావు, గ్రామసచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

కొత్తపాలెంలో 168 మందికి వైద్య పరీక్షలు

నరసరావుపేట: ప్రభుత్వం ప్రజల ఆరోగ్యకోసం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం మంగళవారం మండలంలోని కొత్తపాలెం బసికాపురం ఎంపీపీ స్కూలులో నిర్వహించారు. మొత్తం 168మంది రోగులను రిజిస్టర్ చేసుకొని వారికి బీపీ, మధుమేహం, కళ్లు, ఇతర వైద్య పరీక్షలు నిర్వహించారు. వీరిలో 13మందికి ఉన్న పరిస్థితి దృష్టిలో పెట్టుకొని పెద్దాసుపత్రికి రెఫర్ చేశారు. ఎంపీడీవో శ్రీనివాసరావు, కోటప్పకొండ పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ మమతాప్రియ ఆధ్వర్యంలో నిర్వహించిన క్యాంపులో గైనకాలజిస్టు డాక్టర్ భాస్కరలక్ష్మి, జనరల్ మెడిసిన్ వైద్యానికి డాక్టర్ ఫణికుమార్, డాక్టర్ షేక్ ఇబ్రహీం హాజరై వైద్యపరీక్షలు చేశారు. కార్యక్రమంలో జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ బి.గీతాంజలి, ఈవోపీఆర్డీ రమణకుమార్, వైద్యఆరోగ్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యవంతులుగా ఉండాలనేదే..

నాదెండ్ల: దేశంలోనే ఎక్కడా లేని విధంగా ఏపీలో ప్రభుత్వ వైద్యరంగం విప్లవాత్మక మార్పులతో సామాన్యుడికి సైతం కార్పొరేట్ అందిస్తూ ఆరోగ్యాంధ్రప్రదేశ్ సాకారం దిశగా పయనిస్తోందని ఎంపీపీ తలతోటి రాణి, జెడ్పీటీసీ కాట్రగడ్డ మస్తాన్‌రావు చెప్పారు. మండల కేంద్రమైన నాదెండ్ల శివాలయం కల్యాణ మండపంలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య క్యాంపు నిర్వహించారు. నాదెండ్ల, గణపవరం పీహెచ్‌సీల వైద్యులు ప్రియాంక, సాయిశ్వేత, ఎల్ ప్రసాద్‌నాయక్‌తో పాటు కాటూరి మెడికల్ వైద్యశాల వైద్య నిపుణులు డాక్టర్ అవినాష్, డాక్టర్ ధీరజ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా 412 మందికి 14 రకాల పరీక్షలు నిర్వహించి 105 రకాల మందులు ఉచితంగా అందించారు. వీటితో పాటూ ఈసీజీ, వైఎస్సార్ కంటి వెలుగు పరీక్షలు నిర్వహించారు. కళ్లజోళ్లు పంపిణీ చేశారు. 30 మంది వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకానికి ఎంపికైనందున వారికి టోకెన్లు అందించారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పౌష్టికాహార ఆవశ్యకత, పలు ఆహార పదార్థాల ప్రదర్శన నిర్వహించారు. అనంతరం కళ్ల సమస్యలు ఉన్న వారికి కళ్లజోళ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎస్.నాగమల్లేశ్వరరావు, ఎంపీడీవో షేక్ జాకీర్ హుస్సేన్, ఎంఈవో ఆంజనేయులు, మండల పార్టీ అధ్యక్షుడు మద్దూరి కోటిరెడ్డి, జగనన్న సురక్ష మండల కన్వీనర్ అల్లడి రవికుమార్, నాదెండ్ల, గణపవరం సొసైటీల అధ్యక్షులు కురుకుంట్ల వెంకటరెడ్డి, మంగు ఏడుకొండలు, ఎంపీటీసీలు యల్లారావు, ఏసమ్మ, అంకమ్మ, కనపర్రు సర్పంచ్ వెంకటేశ్వర్లు, గద్దె కోటయ్య, కార్యదర్శి రాఘవయ్య, కె.రామకృష్ణ, చెంచురాజు, నాగయ్య, మలిపెద్ది శివ, కాంద్రు శేషయ్య, పట్టాభి పాల్గొన్నారు.



పేరూరుపాడులో రోగులకు వైద్యపరీక్షలు చేస్తున్న ప్రత్యేక వైద్యబృందం



వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న ఇన్‌చార్జి ఎంపీడీవో, ప్రజాప్రతినిధులు



నాదెండ్లలో పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య నిపుణులు



నరసరావుపేటలో మందులను తీసుకుంటున్న రోగులు



నాదెండ్లలో కళ్లజోళ్లు పంపిణీ చేస్తున్న నాయకులు, అధికారులు



రోగులకు నేత్రాలు పరీక్ష చేస్తున్న డాక్టర్

సంతగుడిపాడులో ..

రొంపిచర్ల: మండలంలోని సంతగుడిపాడు గ్రామంలో మంగళవారం జగనన్నా ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 450 మంది రోగులకు పరీక్షలు నిర్వహించి రోగ నిర్ధారణ అనంతరం మందులు అందజేశారు. 166 మంది పురుషులకు, 243 మంది స్త్రీలకు, 48 మంది పిల్లలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. పరీక్షలైన అనంతరం అవసరమైన మందులు అందజేశారు. 141 మందికి షుగర్ పరీక్షలు, 63 మందికి కంటి పరీక్షలు ఇరువురికి టీబీ, ఆరుగురికి డెంగ్యూ, 11 మందికి మలేరియా, గుండెకు సంబంధించిన 32 మందికి ఈసీజీ పరీక్షలు నిర్వహించారు. 22 మందికి కళ్లజోళ్లు అందజేశారు. 13 మందికి మెరుగైన వైద్య చికిత్స నిమిత్తం నరసరావుపేట వైద్యశాలలకు రిఫర్ చేశారు. డీఎం అండ్ హెచ్‌వో డాక్టర్ రవిబాబు, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ గీతాంజలి శిబిరాన్ని సందర్శించి పర్యవేక్షించా రు. ఈ శిబిరంలో ఆర్థో స్పెషలిస్ట్ డాక్టర్ బాలకృష్ణ, చిన్న పిల్లల వైద్యులు డాక్టర్ స్పందన, రెడ్డిపాలెం పిహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ రేవతిభాయి. డాక్టర్ జగన్ నరసింహారెడ్డి, వైద్య సిబ్బంది, వలంటీర్లు పాల్గొని వైద్యసేవలు అందించారు.



సంతగుడిపాడులో రోగులకు మందులు అందజేస్తున్న వైద్య సిబ్బంది

స్కూల్‌గేమ్స్ పోటీలకు యడ్లపాడు విద్యార్థులు



ఎంపికైన క్రీడాకారులతో హెచ్‌ఎం విజయభారతి, పీఈటీ షేక్ ఆషీతున్

యడ్లపాడు: త్వరలో జిల్లాస్థాయిలో జరిగే వివిధ క్రీడాపోటీలకు యడ్లపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు 8 మంది ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం జి.విజయభారతి తెలిపారు. ఈ సందర్భంగా జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులకు మంగళవారం పాఠశాల ఆవరణలో అభినందన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి మాట్లాడారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్‌లో భాగంగా ఈనెల 29వ తేదీన నాదెండ్ల మండలం సాతులూరు జెడ్పీహైస్కూల్లో నియోజకవర్గ స్థాయిలో నిర్వహించిన కబడ్డీ, ఖో-ఖో, త్రోబాల్, వాలీబాల్ క్రీడల్లో తమ పాఠశాల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభను ప్రదర్శించారని తెలిపారు. ఆయా పోటీల్లో నైపుణ్యాన్ని ప్రదర్శించిన విద్యార్థులు అండర్ -14 కబడ్డీ బాలికల విభాగంలో పఠాన్ నాస్మిన్, బాలుర విభాగంలో జి.ధర్మతేజ, అండర్-17లో కబడ్డీలో ఆర్ కిషోర్, అండర్-14 త్రోబాల్ బాలికల్లో ఎం సమీర, అండర్-17 త్రోబాల్ పి రూపాంజలి, అండర్ -17 వాలీబాల్‌లో యు అభిలాష్, అండర్-14 ఖో-ఖోలో జి తులసీరాం, అండర్ -17 వాలీబాల్ జి సాగర్‌బాబు జిల్లాస్థాయి క్రీడాపోటీలకు ఎంపికైనట్లు వెల్లడించారు. అనంతరం విద్యార్థులతో పాటు వారికి మంచి తర్ఫీదునిచ్చిన పాఠశాల పీఈటీ షేక్ ఆషీతున్‌ను సత్కరించారు. జిల్లాస్థాయిలోనూ క్రీడా సత్తాను చూపించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావాలని ఆకాంక్షించారు. అభినందించిన వారిలో పంచాయతీ ఎంపీపీ పి.ఝాన్సీ, సర్పంచ్ కె.హేమ, ఎంఈవో 1,2 నాగరత్నం, అరుణకుమారి, పీఎం చైర్మన్ కె.వేణుబాబు ఉపాధ్యాయులు ఉన్నారు.

రొంపిచర్ల మండలంలో భారీ వర్షాలు

రొంపిచర్ల: మండలంలోని అన్ని గ్రామాల్లో సోమవారం రాత్రి భారీ వర్షం కురిసింది. మండల కేంద్రమైన రొంపిచర్లలో మంగళవారం ఉదయానికి 22.8 ఎం.ఎం. వర్షపాతం నమోదైనట్లు తహసీల్దార్ కార్యాలయ అధికారులు తెలిపారు. కొన్ని గ్రామాల్లో ఓ మోస్తరు వర్షాలు కురియగా, విప్పర్ల, రెడ్డిపాలెం, కొత్తపల్లి తదితర గ్రామాల్లో భారీ వర్షం కురిసింది. రైతులు దుక్కులు దున్నిన పొలాల్లో వర్షం నీరు నిలబడింది. మంగళవారం కూడా ఆకాశం మేఘావృతమై అప్పుడప్పుడు చిరుజల్లులు పడుతూ ఉన్నాయి. వర్షం కారణంగా వ్యవసాయ పనులు నిలిచిపోయాయి. వాగులు, వంకలు నీటి ప్రవాహం ప్రారంభమైంది.

పత్తిలో తెగుళ్ల నివారణకు చర్యలు తీసుకోండి

– ఏవో సీహెచ్ సరిత



తిమ్మాపురంలో పత్తిపంటను రైతులతో కలిసి పరిశీలిస్తున్న ఏవో సరిత

యడ్లపాడు: మండలంలోని తిమ్మాపురం గ్రామాన్ని ఏవో సీహెచ్ సరిత మంగళవారం సందర్శించారు. స్థానిక రైతులతో కలిసి గ్రామం పరిధిలోని ఖరీఫ్ సాగు చేస్తున్న పంట పొలాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. గ్రామం పరిధిలో పత్తిపంట ప్రస్తుతం గూడ, పూత దశలో ఉన్నట్లు గుర్తించారు. ఈ సమయంలో గులాబీరంగు పురుగు ఆశించే అవకాశం ఉన్నందున ముందస్తు జాగ్రత్తగా లీటర్ నీటికి ప్రొఫెనోఫాస్ 2.0మిలీ లేదా క్లోరిపైరిఫాస్ 2.5మిలీ చల్లుకోవాలని రైతులకు సూచించారు. పూత, పిందె రాలుతున్నట్లయితే 0.15శాతం బోరెక్స్‌ను 10.15 రోజుల వ్యవధిలో పిచికారి చేయాలని, ఇక లోతట్టు ప్రాంతంలోని పైరు నీటి ఎద్దడికి గురైతే 1-2శాతం పొటాషియం నైట్రేట్ (మల్టీకే)ను చల్లుకోవాలని చెప్పారు. పత్తికి ఆశించి రసంపీల్చే పురుగుల నివారణకు ఎసిఫేట్ 1.5 గ్రా, మోనోక్రోటోఫాస్ 1.6 గ్రా, ఫిప్రోనిల్ 2.0 మిలీ వీటిలో ఏదైనా ఒకదానిని లీటర్ నీటికి కలిపి పిచికారి చేసుకుని రసంపీల్చే పురుగుల్ని నివారించుకోవచ్చని తెలిపారు.

ఆర్‌బీకే సందర్శన..

అనంతరం గ్రామంలోని రైతుభరోసా కేంద్రాన్ని వెళ్లారు. ఆర్‌బీకేలోని రికార్డులను వ్యవసాయ, ఉద్యాన సహాయకుల విధుల నిర్వహణపై రైతుల్ని అడిగి తెలుసుకున్నారు. సమయపాలన సక్రమంగా చేయాలని ఆదేశించారు. ముఖ్యంగా మండలంలోని అన్నీ ఆర్‌బీకేల్లో ఏఏ, హెచ్‌ఏలు విధిగా రెండు లేదా మూడురోజుల్లో తమ కేంద్రం పరిధిలోని రైతులచే వారు సాగు చేసిన పంటల ఈ -క్రాప్ నమోదు, అలాగే ఈకేవైసీ ప్రక్రియను రెండురోజుల్లోగా పూర్తి చేయాలని ఆదేశించారు.